ప్రజాశక్తి

శనివారం 9 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

లాభాల్లో ఉన్నా ప్రై'వేటా'...

సొంత ఆసుపత్రికి ఇదేం సపోర్టు

విశాఖ పోర్టు స్థలాలు, ఆస్తులపై యాజమాన్య విధానం పట్ల సర్వత్రా ఆగ్రహం

పోర్టు గేట్ వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న పద్మనాభరాజు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పోర్టుకు రిజర్వు నిధులు రూ.కోట్లలో ఉన్నాయి. ఏటా గణనీయ లాభాలను ఆర్జిస్తోంది. ప్రగతిని పరిశీలిస్తే.. దేశంలోని 24 పోర్టుల్లో మొదటి నాలుగు స్థానాల్లో ఈ పోర్టు కచ్చితంగా ఉంటోంది. ఇటువంటి తరుణంలో సొంత ఆస్తులను పిపిపి పేరుతో ప్రై 'వేటు'కు ఇవ్వాల్సిన అవసరం ఏమిటి ? అని పోర్టు యూనియన్లు, కార్మికులే కాదు.. విశాఖ ప్రజానీకమంతా ప్రశ్నిస్తోంది. నగరంలోని కైలాసపురం హైవేకు ఆనుకుని ఆరు ఎకరాల్లోగల పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను కేవలం రూ.212 కోట్లకే ప్రైవేట్ వాళ్లకు అప్పగించే పోర్టు యాజమాన్య వ్యూహంపై నేడు సర్వత్రా చర్చ జరుగుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో ఇనార్బిట్ మాల్‌కు 17 ఎకరాలకుపైగా పోర్టు స్థలాలను పాలకులు కట్టబెట్టారు. తాజాగా హాస్పిటల్ కోసం పిపిపిలో పిలిచిన టెండర్లను శుక్రవారం తెరవాల్సి ఉంది. అయితే, సిఐటియు, ఇతర యూనియన్ల ఆందోళనలతో ఈ టెండర్ల ప్రక్రియను పోర్టు బోర్డు మీటింగ్‌లో ఛైర్మన్ అంగముత్తు వాయిదా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. పోర్టు ఆస్తులు, స్థలాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టకుండా పోర్టే నిర్వహించాలన్న పోరాటాన్ని పోర్టు కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున 40 రోజులుగా చేపడుతుండటంతో అధికారులు మీమాంశలో పడ్డారు.

ఏటా లాభాల బాట.. కానీ నష్టాల మాట

ఇటీవలే పోర్టు 91 ఏళ్ల ఉత్సవాలను ఘనంగా జరుపుకుంది. ఏనాడూ పోర్టు నష్టపోయిన ఉదంతం లేదు. పిపిపిలో బెర్తులను ఆదానీలాంటి వాళ్లకు కట్టబెట్టినప్పుడు తప్ప.. మిగతా అంతా బాగానే ఉంది. గత ఆర్థిక సంవత్సరంలోనే సుమారు రూ.300 కోట్లకుపైగా మిగతా 2లో..

వార్తలు 8లో..

తిమ్మరాజుపేటలో ప్రభుత్వాల విధానాలను ప్రజలకు వివరిస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలపై సిపిఎం ప్రజాపోరు

- ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటా ప్రచారం
- పలుచోట్ల కరపత్రాల పంపిణీ, వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

జివిఎంసి స్థాయీ సంఘంలో

అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఆ వివరాలను స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి మీడియాకు వెల్లడించారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 71 అంశాలను పొందుపరిచారని, మిగతా 2లో..

జాయ్ జమీమా కేసులో మరో బాధితుడు

▶ వార్త 2లో..

జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

▶ వార్త 5లో..

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ ప్రారంభం

▶ వార్త 8లో..

13న నీటి సంఘాల ఓటర్ల తుది జాబితా

10 వరకూ నమోదు ప్రక్రియ

ఉమ్మడి విశాఖలో 360 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో నీటి వినియోగదారుల సంఘ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ఈ నెల 13న విడుదల కానుంది. పది వరకు ఓటర్ల నమోదు కొనసాగనుంది. ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 13న తుది జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన ఓటర్ల నమోదు రెవెన్యూ యంత్రాంగం చేస్తోంది. రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆయకట్టుదారుల వివరాలను సరిచూసుకొని ఓటర్ల నమోదు చేస్తున్నారు. 2015లో సాగునీటి సంఘ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల నాటి ఓటర్ల జాబితాను తాజా పర్చే క్రమంలో చనిపోయిన, భూమి విక్రయించిన వారి పేర్లను తొలగించి, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ స్థానంలో ప్రస్తుత ఆయకట్టుదారుడిని ఓటరుగా నమోదు చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మేజర్, మధ్య తరహా, చిన్న తరహా నీటిపారుదల వనరుల కింద 2,13,426 ఎకరాల విస్తీర్ణం సాగవుతోంది. ఈ ఆయకట్టు పరిధిలో 360 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయకట్టుదారులు సుమారు మూడు లక్షల మంది వుంటారని అంచనా. అయితే తుది ఓటర్ల జాబితా విడుదలైతే ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. 2015 తరువాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో రాబోయే ఎన్నికలకు ఓటర్ల నమోదుపై రెవెన్యూ సిబ్బంది కసరత్తు ఎక్కువ చేయాల్సివస్తోంది. అనకాపల్లి జిల్లాలోని తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు ప్రాజెక్టుల్లో ఒక ప్రాజెక్టు కమిటీ చొప్పున నాలుగు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. తాండవకు ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 27 నీటి వినియోగదారుల సంఘాలు, 324 ప్రాదేశిక సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. రైవాడ ప్రాజెక్టుకు 10 నీటి వినియోగదారుల సంఘాలు, మిగతా 2లో..

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

విశాఖ నగరంలో సుడిగాలి పర్యటన

భోజన తయారీ కేంద్రంలో ఆకుకూరలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులను, వైద్యారోగ్య సిబ్బందిని, అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. క్రమం తప్పకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలని, వాటి ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని చెప్పారు. శుక్రవారం కంచరపాలెం ఓల్డ్ ఐటిఐ ప్రాంతంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన భాగస్వామ్యమయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సహా ఇతర అధికారులతో కలిసి కాలనీలోని పలు నివాసాలను సందర్శించారు స్థానికులతో మాట్లాడారు. ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు హితవు పలికారు. నీటితో ఉండే పాత్రలను, కుండీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు ఇతరత్రా కీటకాలు దరి చేరకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పాత ఐటిఐ జంక్షన్, ఊర్వశి జంక్షన్ పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాలను, యుపిహెచ్‌సిలను కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రమంలో ముందుగా అక్షయ పాత్ర వారు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వారు వినియోగించే సరుకుల నాణ్యతను పరిశీలించారు. తాజా కూరగాయలను, నాణ్యమైన నూనెలు, పప్పులు వినియోగించాలని ఈ సందర్భంగా నిర్వాహకులకు చెప్పారు. అక్కడ కొంచెం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సొంత ఆసుపత్రికి ఇదేం సపోర్టు

లాభాలను సరుకు రవాణా ద్వారా పోర్టు ఆర్జించింది. అంతర్జాతీయ స్థాయికి విశాఖ పోర్టును అధికారుల సమిష్టికృషి, కార్మిక, ఉద్యోగుల శ్రమతో తీసుకెళ్లడం వాస్తవం. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే వైజాగ్ పోర్టు కార్గో హేండ్లింగ్‌లో దూసుకుపోతోంది. 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరంలో క్రూడ్, ఎల్‌పిజి, బొగ్గు, ఇతర వస్తువుల కార్గో హేండ్లింగ్‌లో ఇప్పటికే (తొలి అర్ధభాగంలోనే) 45 శాతం దాటి లక్ష్యం దిశగా వెళ్లింది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రైవేట్ పాట నిత్యం యాజమాన్యం ఎందుకు పాడుతోంది ? అన్న విమర్శలు నేడు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్లు, ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనం కోసమే ఇదంతా చేస్తోందంటూ ట్రేడ్ యూనియన్లు, వామపక్షాలు తీవ్రస్థాయిలో పోర్టు వ్యవహారంపై మండిపడుతున్నాయి.

ప్రైవేట్ వ్యక్తికి భలే చౌకబేరం...!

సుమారు రూ.350 కోట్ల విలువైన గోల్డెన్ జూబ్లీ పోర్టు ఆసుపత్రి ఉన్న 6 ఎకరాల ఏరియాకు మాంచి గిరాకీ ఉంది. కేవలం రూ.212 కోట్లుకు పిపిపిలో ఇస్తే ఒక్క రూపాయి జేబులోంచి పెట్టుబడి పెట్టకుండా గుత్తేదారు అంతా స్వాహా చేస్తాడు. ఈ భూమిని బ్యాంకులో తనఖా పెట్టినా పెట్టుబడిలో 80 శాతం అంటే సుమారు రూ.240 కోట్లు రుణం వచ్చేస్తుంది. పిపిపి పేర ఇలా కాజేసి వెనకాల వ్యాపారం చేసుకుంటాడు. ఇలా పిపిపి ద్వారా టెండరు దక్కించుకున్న సదరు సంస్థ లేదా గుత్తేదారుకు లాభాల పంటే పండనుంది. పోర్టు యాజమాన్యం అవలంబిస్తున్న ఈ వైఖరి గర్హనీయమని పలువురు అంటున్నారు.

13న నీటి సంఘాల ఓటర్ల తుది జాబితా

120 ప్రాదేశిక సభ్యులు, కోనాంకు ఎనిమిది నీటి వినియోగదారుల సంఘాలు, 96 ప్రాదేశిక సభ్యులు, పెద్దేరుకు 10 నీటి వినియోగదారుల సంఘాలు, 116 ప్రాదేశిక సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి.

విశాఖపట్నం జిల్లాలో చిన్నతరహా నీటిపారుదల వనరుల కింద 29 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 174 ప్రాదేశిక సభ్యులు, పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో చిన్న తరహా నీటి పారుదల వనరుల కింద 28 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 168 ప్రాదేశిక సభ్యులకు ఎన్నిక జరగనుంది.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వాడిపోయి ఉన్న కేరట్ దుంపలను చూసిన ఆయన వాటిని తక్షణమే మార్చాలని, కూరల తయారీలో వాటిని వినియోగించవద్దని నిర్వాహకులకు చెప్పారు. అనంతరం భోజనశాలలో కలియ తిరిగిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు వివిధ అంశాలపై మాట్లాడారు. వారిలో ఉన్న విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించారు. విద్యాపరమైన సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక యుపిహెచ్‌సిని సందర్శించి, అక్కడి పరిస్థితులను గమనించారు. వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని వైద్యాధికారులకు సూచించారు. టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. తదుపరి ఊర్వశి జంక్షన్ వద్ద గల అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు అందుతున్న ఆహార పట్టికలను, ఇతర రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందే సేవలపై ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని, వారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని సూచించారు.

సీతమ్మధార : భవాని గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుంకరపేట, సిద్ధార్థ నగర్ సచివాలయాన్ని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావుతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. అన్ని వార్డుల పరిధిలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి తులసి, ఆరోగ్య సిబ్బంది నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

వాటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప 11 అంశాలను వాయిదా వేయడమైనదని తెలిపారు. మిగిలిన 60 అంశాలు ఆమోదం పొందాయన్నారు. వీటిలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.17.50 కోట్ల అభివృద్ధి పనుల అంశాలు, రెవెన్యూ, ఉద్యోగుల సర్వీసులకు సంబంధించిన అంశాలు ఉన్నాయన్నారు. సమావేశంలో జివిఎంసి కార్యదర్శి బివి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఆరో జోనల్ కమిషనర్ బిఆర్ఎస్.శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీధర్, శేఖర్, కనకారావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్య పురస్కార్ సర్టిఫికెట్ అందుకుంటున్న జస్వంత్

జస్వంత్‌కు రాజ్య పురస్కార్ ప్రదానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ నజీర్ స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులకు రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లు ప్రదానం చేయగా కంచరపాలెంకు చెందిన శ్రీ విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి జస్వంత్ సూర్య ఆ సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారి, జిల్లా చీఫ్ కమిషనర్ ఎన్.ప్రేమకుమార్ రాజ్య పురస్కార్ అందుకున్న జస్వంత్ సూర్యను అభినందించారు. రాష్ట్ర యువజన విభాగం చైర్పర్సన్ మారుతి హరీష్ కుమార్, జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్ తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

జాయ్ జమీమా కేసులో మరో బాధితుడు

కేసు నమోదు చేసిన ఎంవిపి పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో సంచలనం సృష్టించిన జాయ్ జమీమా కేసులో మరో బాధితుడు వెలుగులోకి వచ్చాడు. జాయ్ జమీమా వేణు రెడ్డి అనే యువకునితో కలిసి తనను మోసం చేసిందని శుక్రవారం ఎంవిపి కాలనీ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు నమోదైంది. ఆ ప్రకారం.. 2019లో ఉద్యోగం నిమిత్తం విశాఖ నగరంలో నివాసం ఉన్న బాధితునికి తన ఆఫీసులో పనిచేసే కె.జాయ్ జమీమాతో పరిచయం ఏర్పడింది. అనంతరం ఆమె స్నేహితుడు వేణు రెడ్డిని పరిచయం చేసింది. వారిరువురూ తన వద్ద రెండు సెల్ ఫోన్లు దొంగిలించి మరొక వ్యక్తి ద్వారా డబ్బులు వసూలు చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేకాకుండా వీరిరువురూ కలిసి బుల్లయ్య కాలేజ్ సమీపంలో ఒక ఇంట్లో తనను నిర్భంధించి మత్తు పదార్థాలు తీసుకోవాలని బలవంతం చేసినట్టు తెలిపాడు. ఆ సమయంలో జమీమా తనను చంపేందుకు కూడా ప్రయత్నించిందని, డెబిట్ కార్డు ద్వారా రూ.1,50,000 నుంచి రూ.2 లక్షల వరకూ దోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నాడు. శారీరకంగా, మానసికంగా వేధింపులకు నిత్యం గురిచేశారని వాపోయాడు.

ఇదిలా ఉండగా జాయ్ జమీమా, ఆమె స్నేహితుడు వేణు రెడ్డిపై ఇప్పటికే భీమిలి, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి.

ఫలించిన మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ కార్మికులు 16 రోజులపాటు చేసిన సమ్మె మంచి ఫలితాలను సాధించింది. సమ్మె సందర్భంగా హామీ ఇచ్చిన మేరకు పబ్లిక్ హెల్త్ కార్మికులకు శుక్రవారం రూ.1,000 చొప్పున 5 వేల మందికి రూ.50 లక్షలు, అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.50 లక్షలు నేరుగా కార్మికుల అకౌంట్‌లో జమ అయ్యాయని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌ను ఈ మేరకు యూనియన్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ

కార్మికుల ఖాతాల్లో రూ. కోటి జమ

సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా చేసిన 16 రోజుల సమ్మె సందర్భంగా వన్ టైంగా రూ.1,000 చొప్పున 5 వేల మందికి, అలాగే మరణించిన 22 మందికి రూ.2 లక్షలు చొప్పున మొత్తం సుమారు రూ.1 కోటి కార్మికుల అకౌంట్‌లో పడ్డాయన్నారు. మిగిలిన నీటి సరఫరా, ఇతర విభాగాల ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ రూ.1,000 చొప్పున, నీటి సరఫరా, యుజిడి, ఇతర కార్మికులకు కూడా వెంటనే వేయాలని కమిషనర్‌ను కోరారు.

సెవెన్ హిల్స్‌లో కార్మికులను తొలగిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రామ్ నగర్ జంక్షన్‌లో ఉన్న సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తొలగిస్తే ఊరుకునేది లేదని విశాఖ జిల్లా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి వై.రాజు అన్నారు. ఈ ఆసుపత్రిలో 38 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తుండగా వారందరినీ తొలగించాలని నిర్ణయించిన యాజమాన్యం ఎనిమిది మందికి నోటీసులు ఇవ్వటాన్ని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం ఆసుపత్రి ఎదుట పారిశుద్ధ్య కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో కొన్ని దశాబ్దాలుగా పారిశుద్ధ్య కార్మికులు 38 మంది పనిచేస్తున్నారని చెప్పారు. వీరిలో కొందరు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారన్నారు. సీనియర్లుగా ఉన్న కార్మికులను యాజమాన్యం తొలగించాలని నిర్ణయించడం చట్టవిరుద్ధం అన్నారు. నెల రోజులులోగా కార్మికులందరినీ తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఆసుపత్రి ఆర్థిక పరిస్థితి బాగోలేదని, వ్యాపారం సక్రమంగా సాగటం లేదని, ఆర్థిక మాంద్యంలో ఖర్చులు తగ్గించుకునే చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను తొలగిస్తున్నట్లు నోటీసులో పేర్కొనడం సరికాదన్నారు. సెవెన్ హిల్స్ ఆసుపత్రికి లాభాలు ఎంతగానో వచ్చాయని, వాటితో చెన్నై వంటి ప్రాంతాలలో భారీ స్థాయిలో ఆసుపత్రులను ఏర్పాటు చేశారని రాజు చెప్పారు. ఆందోళన కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఆందోళన జరుగుతున్న సంగతి తెలిసి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అక్కడికి వచ్చి కార్మికులకు మద్దతు తెలిపారు. అనంతరం ఆసుపత్రి హెచ్‌ఆర్ భానుతో వై.రాజు సమావేశమయ్యారు.

బిఫోర్ ది డిస్ట్రిక్ట్ కంజుమర్ డిస్ప్యూట్స్ రెడ్రెసల్ కమీషన్ ఒంగోలు::ప్రకాశం జిల్లా

C.C.No.68/2023

కాకర్ల శ్రీనివాసరావు ... కంప్లైనెంట్

మరియు

M/s శ్రీ వెంకటేశ్వర నెక్సజెన్ మోటర్స్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొ: సాయిరామ్ మరోకరు

.....ఆపోజిట్ పార్టీస్

To:
OP2) : Dande Renewable Energy Pvt. Ltd., Rep. by its Authorized Signatory, Door No.8-4-43, P.No.18, Prasanthi Nagar, Pedawaltair Visakhapatnam, Andhra Pradesh

పై కేసులో మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయాలు రిజిస్టరు పోస్టుద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున, కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసులు పంపడమైనది. కావున మీరు తేది 26-11-2024న పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, లాయరుద్వారా గాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని యిందు మూలంగా తెలియపరచటమైనది.

వాయిదా తేది : 26-11-2024

ఇట్లు
జి.నాగిరెడ్డి
కంప్లైనెంట్ తరపున న్యాయవాది
ఒంగోలు

మహారాజశ్రీ నంద్యాల జిల్లా ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు

I.A.No.110/2024 in I.P.No.6/2018

C. సరస్వతమ్మ మరియు 14 మంది. ...అర్జీదారులు

Versus

K. పాపిరెడ్డి మరియు ఇద్దరు

3వ రెస్పాండెంట్ చిరునామా :
K. సతీష్ కుమార్ రెడ్డి
S/o జగదీష్ రెడ్డి
ఇంటి నెంబరు 8-54-4,
నేతాజి విది, చిన్న వాల్తేరు,
విశాఖపట్టణం. ...రెస్పాండెంట్లు

మూడవ రెస్పాండెంట్‌కు నోటీసు

ఇందు మూలముగా మూడవ రెస్పాండెంట్‌కు తెలియజేయటం ఏమనగా పైన కనపరచిన కేసులో మీరు మైనారిటీ తీరి మేజరుగా అనగా 18 సంవత్సరములు దాటి నందున మీ యొక్క సంరక్షకుడిని తొలగించే విషయమై మీకు ఏమైనా ఆక్షేపణ ఉన్న యెడల నీవు ఖుద్దునగాని లేదా వకీలు ద్వారా కాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు. సదరు కేసు మీ యొక్క హాజరుకు గాను 13-11-2024వ తేదిన కలదు. కావున పైన పేర్కొన్న తేదిన ఉదయం 10:30 ని॥ల॥ హాజరు కాగలరు. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

వాయిదా తేది : 13-11-2024

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
నాయినేని సురేష్ కుమార్,
B.Com B.L.,
అడ్వకేటు, ఆత్మకూరు.
సెల్ నెంబరు : 9440590914

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.A.No.76/2019 in O.S.No.322/1996

ఆకెళ్ళ అగ్ని హోత్రుడు (డైడ్) వగైరా ...Petitioner/Dhrs

Petitioner/Dhrs 2 to 5 being represented by regd. G.P.A. Medapati Gangadhara Subrahmanyeswara Reddy)

మరియు

పాలపర్తి సరోజినీ డైడ్ వగైరా ...Respondents/Jdrs

To.
1.పాలపర్తి విజయశేఖర్, S/o.లేటు భాస్కరరావు, డోరునెంబర్.8-25, చినపేట లంకలకోడేరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. పిన్:534250. Respondent No.3
2.పిల్లి ఎస్తేరు విజయకుమారి, భర్త విజయకుమార్, 129 MP, ఎలిమెంటరి స్కూల్ దగ్గర, RVM Buildings Housing Colony, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.534201. Respondent No.4
3.ఇసుకపట్ల రాజ్యలక్ష్మి, భర్త కిశోరు, 166 అంగన్‌వాడీ సెంటర్ దగ్గర, తాడి వీధి, పోలీస్ క్వార్టర్స్ దగ్గర, ఇసకతోట, విశాఖపట్నం జిల్లా - 530022 Respondent No.5

మీ పై, పై పిటీషనరు పై కోర్టులో పై దావా ఆస్తిని బహిరంగ వేలము వేయించుట మూలముగా దావా డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తం మీ పై పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున సదరు దావాలో 3,4 మరియు 5వ Respondents/JDrs అయిన మీకు పలుమార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపించినను, ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పిపంపించి వేసినందున శ్రీపైకోర్టు వారు పై Respondents అయిన మీ యొక్క హాజరు నిమిత్తం పత్రికలో ప్రకటన చేయవలసినదిగా ఆర్డర్ జారీ చేసినారు. సదరు ఆర్డరు ప్రకారం సదరు పిటిషను ది.28-11-2024 తేదికి వాయిదా అయి వున్నది. కాబట్టి మీరు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.00 గంటల నుండి హాజరై ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున పై పిటిషను తీర్మానం చేయబడును.

//Order of Court//

నర్సాపురం రామారావు పొన్నమండ
తేది.08-11-2024 అడ్వకేట్, నర్సాపురం.

పొదుపు, ఆర్‌డి సొమ్ములు మాయం

• బాందేవుపురం గ్రామీణ పోస్టల్ కార్యాలయంలో ఘటన

• లబోదిబోమంటున్న బాధితులు : పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బాందేవుపురం గ్రామీణ పోస్టల్ కార్యాలయం పరిధిలోని విలాస్‌ఖాన్‌పాలేం గ్రామానికి చెందిన 51 మంది పొదుపు, ఆర్‌డి సొమ్ములు తమ ఖాతాలకు జమ కాలేదని లబోదిబోమంటున్నారు. స్థానిక పోస్టల్ రన్నర్ ద్వారా పొదుపు, ఆర్‌డి సొమ్ములు ప్రతినెలా జమ చేస్తుండగా, ఈ ఏడాది మార్చి,ఏప్రిల్ నెలల సొమ్ములు ఆయా ఖాతాలకు జమ కాలేదని బాధితులు అంటున్నారు. సుమారు రూ.90వేలు స్వాహా చేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

మండలంలోని రెడ్డిపల్లి సబ్‌పోస్టాఫీస్, బాందేవుపురం గ్రామీణ పోస్టల్ కార్యాలయం పరిధిలో లాస్‌ఖాన్‌పాలేం, విజయరామపురం, రెల్లి కాలనీ, తిమ్మాపురం గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన తపాలాలు, పొదుపులు, రికరింగ్ డిపాజిట్లు, ఇతర లావాదేవీలన్నీ బాందేవుపురం పోస్టాఫీస్ ద్వారా జరుగుతున్నాయి. అయితే విలాస్‌ఖాన్‌పాలేనికి చెందిన పలువురు పేదలు, వృద్ధులు, వికలాంగులు తమ సొమ్ములను బాందేవుపురం పోస్టల్ కార్యాలయంలో పొదుపు ఖాతాల్లోనూ, ఆర్‌డిలుగా డిపాజిట్లు చేస్తున్నారు. విలాస్‌ఖాన్‌పాలేం నుంచి బాందేవుపురానికి మూడు కిలోమీటర్లు దూరం ఉండడం, రెండు గ్రామాల మధ్య ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో, లబ్ధిదారులంతా ప్రతినెలా పోస్టాఫీస్‌కు వెళ్లి డిపాజిట్లు కట్టలేని పరిస్థితుల్లో, పోస్టల్ రన్నర్ లోకేష్ సహకారం తీసుకుంటున్నారు. కొన్నాళ్లుగా ఈవ్యవహారం సజావుగా సాగినప్పటికీ, ఇటీవల మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి పోస్టల్ డిపాజిట్లు సొమ్ములు పక్కదారి పట్టాయని పలువురు వాపోతున్నారు.

తమ ఖాతా పుస్తకాలు నిండిపోవడం, కొన్ని డిపాజిట్లకు మెచ్యూరిటీ కావడంతో వాటికోసం వెళ్లేసరికి, కొన్ని వాయిదాలు డిపాజిట్ కాలేదని తెలిసిందని లబ్ధిదారులు అంటున్నారు. ఇంతలో ఇడిడిఎ లోకేష్‌కు బదిలీ కావడంతో అంతా గందరగోళంగా మారింది. దీంతో ఆందోళన చెందిన ఖాతాదారులు తమ సొమ్ములను వాపసు చేయడంతోపాటు కొత్త పుస్తకాలను ఇవ్వాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. తమ ఖాతాలకు జమ చేయాలని కట్టిన సొమ్ములు జమ కాలేదనిగ్రామానికి చెందిన కనకల గంగమ్మ, బోని సన్యాసమ్మ, బోని వెంకటరమణ తదితరులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల స్పందన, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జిమ్‌సర్‌లో రేడియాలజీ దినోత్సవం

మాట్లాడుతున్న ప్రొవిసి గీతాంజలి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న జిమ్‌సర్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ, ప్రసూతి గైనికాలజీ ఆర్థోపెడిక్, వాస్కులర్ వంటి చికిత్సలలో కచ్చితమైన నిర్ధారణ పరీక్షలను రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.సురేష్ మాట్లాడుతూ ఎపిక్‌ఎలైట్ ఆల్ట్రా సౌండ్ వంటి అధునాతన వైద్య పరికరం ద్వారా రేడియాలజీ సేవలను అందిస్తున్నామనారు. అధునిక రేడియాలజీ పరికరాలతో అధిక నాణ్యతతో కూడిన చిత్రాలు, వైద్య విశ్లేషణ చేస్తున్నామని, తద్వారా రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామనివెల్లడిచారు. కార్యక్రమంలో జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, జిమ్‌సర్ ఆసుపత్రి మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ వసంతకుమార్, జిమ్‌సర్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యవిద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

విజయసాయికి అభినందన

విజయసాయితో కార్పొరేటర్ సునీత సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా మరోసారి నియమితులైన రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డిని శుక్రవారం సీతమ్మధారలోని ఆయన నివాసంలో 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. వార్డు నెలకొన్న సమస్యలు, రాజకీయ పరిస్థితులను వివరించారు. వార్డు వైసిపి నేతలు బేతా దుర్గారావు ఉన్నారు.

చిన్నారి కళాకారులకు నాట్య పురస్కారాలు

నాట్యపురస్కారాలు అందుకున్న కళాకారులు

ప్రజాశక్తి- సీతమ్మధార :శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో విశాఖ బాలోత్సవం, మ్యూజిక్ అండ్ డాన్స్ ఫెస్టివల్‌ను శుక్రవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విజయనగరం నర్తనశాల డాన్స్ అకాడమి డాక్టర్. రాధికారాణి., వైజాగ్ కూచిపూడి డాన్స్ అసోసియేషన్ .కళాకారులు మీనా ధార్లపూడి.మీనాక్షి వైజాగ్ రాగా మ్యూజిక్ అకాడమీ కళాకారులు నాగ జ్యోతి కావూరి, రాజమండ్రి. శివసాయి నృత్య కళాక్షేత్రం సాయి మాధవిలను ఘనంగా సత్కరించారు. 25 మంది చిన్నారి నాట్య కళాకారులకు నాట్యభిరామ, అయోధ్య రామ. బాల పురస్కారాలు అందజేశారు ఈ సందర్భంగా శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ అధ్యక్షులు జి కృష్ణ మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకమైన కళాపోషణ, నాటక ప్రదర్శనను పెంపొందించడానికి తమ సంస్థ ఇటువంటి కార్యక్రమా లను నిర్వహిస్తోందన్నారు. అతిథులుగా భళ్ళమూడి ప్రత్యూష, మీగడ శశిభూషణ్ స్వామి, ఎంవి సుబ్రహ్మణ్యం, తిలక్ పట్నాయక్, అల్లు వెంకటరమణ పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధురవాడలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డులో రూ.10,20కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అయోధ్యనగర్ గ్లోబ్ స్కూల్ నుండి మల్లయ్యపాలెం వరకు తారురోడ్డు, బందావన్ కాలనీ పార్క్, బొట్టవానిపాలెంలో సామాజిక భవనం, అయ్యప్పనగర్, చాకలిపేట, గాంధీనగర్, గణేష్‌నగర్, వికలాంగుల కాలనీ, డ్రైవర్స్ కాలనీ, శివశక్తినగర్, కార్పెంటర్స్ కాలనీ, సాయిరాం కాలనీ, బోయపాలెం కాలనీ, పరదేశిపాలెం, మారికవలసలలో సిసిరోడ్లు, డ్రైనేజీలు, స్వతంత్రనగర్, బోరవానిపాలెం, శ్రీనివాసనగర్‌లలో పార్కులు, వికలాంగుల కాలనీ, డ్రైవర్స్ కాలనీ, కార్పెంటర్స్ కాలనీలలో తాగునీటి పైపులైను అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వార్డులో మౌలిక సౌకర్యాల కల్పనకు చొరవ చూపిన ఎమ్మెల్యే గంటాకు కార్పొరేటర్ హేమలత ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి. సింహాచలం, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, నాయకులు పిళ్లా వెంకటరావు, వాండ్రాశి అప్పలరాజు, బోయి శ్రీను, నమ్మి శ్రీను, పిళ్లా నరసింగరావు, నాగోతి వెంకట సత్యనారాయణ, దేవర శివ,ఈగల రవికుమార్, బోయ రమాదేవి పాల్గొన్నారు.

పెందుర్తి :జివిఎంసి 96 వ వార్డులో రూ.7కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయం దొగ్గవానిపాలెం కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, నల్లక్వారీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీరోడ్లు, దుర్గానగర్, ఆదర్శనగర్, సూర్యానగర్ పార్క్, ప్రశాంతి నగర్ పార్క్, రాతి చెరువు ప్రాంతాల్లో కాలువలు, సిసి రోడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు ప్రాధాన్యతా క్రమంలో అన్ని అభివృద్ధి, సంక్షేమ పనులు చేపడతామని ఎమ్మెల్యే పంచకర్ల వెల్లడించారు. జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ శ్రమజీవుల కాలనీలో రూ.15 లక్షల ఉపాధి హామీ నిధులతో వీధిరోడ్లు పనులకు స్థానిక మాజీ సర్పంచ్ లోడగల రమణ, మాజీ ఎంపిటిసి లోడగల వెంకటరావు శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు బమ్మిడి తారక్, రౌతు వెంకటరావు, కంచిబోయిన శ్రీను, పైడిరాజు, ఉప సర్పంచ్ ఈగల నాగరాజు లోడగల సన్యాసి. నమ్మి శ్రీను,కొయ్యి నాని, ఆల్తి రాజు,అప్పారావు, రమణ పాల్గొన్నారు

పెందుర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పంచకర్ల

చరిత్ర పుటలకే ఇక వైసిపి పరిమితం : గంటా

మధురవాడ :వైసిపి నిండా మునిగిన నావ అని, త్వరలోనే చరిత్ర పుటల్లో కలిసిపోతుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఒకసారి అధికారంలోకి వచ్చాక చేపట్టిన దుష్టచర్యలతో అంతర్ధానమయ్యే స్థితిలో ఉందన్నారు. పరదాలు కట్టుకుని ప్రజల్లోకి వెళ్లిన జగన్‌ను, శాశ్వతంగా పరదాల మాటుకు పెట్టేశారన్నారు. కూటమిలో అంతరాల కోసం గుంట నక్కలా కాచుక్కూర్చున్న వైసిపి, జగన్‌కు అది పగటి కలగానే మిగిలిపోనుందన్నారు. అధినేతల మధ్య మైత్రీబంధం ఎప్పటికీ నిలిచి ఉంటుందని, అదే కూటమికి శ్రీరామరక్ష అన్నారు. తగినంతమంది ఎమ్మెల్యేలు లేకున్నా, విపక్ష హోదా కోసం వెంపర్లాడుతున్న జగన్‌కు, అధికారమంటే ఎంతపిచ్చో ఇట్టే స్పష్టమౌతోందన్నారు. మైక్ దొరకదన్న భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని ఆరోపించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-పద్మనాభం : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం రాత్రి మృతి చెందాడు. పద్మనాభం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జివిఎంసి పరిధిలోని హెచ్‌బి కాలనీకి చెందిన గంగిరెడ్డి వర్ధన్(20) ఈ నెల 6న బైక్‌పై వెళుతూ, పద్మనాభం మండలం ఏనుగులపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రమాదవశాతుఉత వాహనం అదుపు తప్పడంతో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రగాయాల పాలైన యువకుడిని విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు. ఘటనపై పద్మనాభం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

172 బస్తాల రేషన్ బియ్యం చోరీ

ప్రజాశక్తి-గాజువాక: నడుపూరులో అమ్మకానికి నిల్వ ఉంచిన 172 బస్తాల రేషన్ బియ్యాన్ని విజయ్ అనే డీలర్ గోడౌన్ నుండి దొంగతనం చేసినట్లు క్రైమ్ పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాములోరి భూమిని రక్షించాలని నిరసన

ప్రజాశక్తి -మధురవాడ : దొంగపత్రాలతో కొమ్మాది శ్రీరాముని దేవాలయానికి చెందిన భూమి క్రయవిక్రయాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం అన్యాక్రాతమైన భూమిలో కొమ్మాది గ్రామస్తులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, రెవెన్యూ రికార్డుల్లో రాములోరి భూమిగా నమోదై ఉన్న కొమ్మాది సర్వే నెంబరు 84లో 31 సెంట్లు భూమినిమధురవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్నప్పటికీ, సెప్టెంబర్ 26న పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెం 7762, 7764 /2004 నెంబర్లతో దొంగ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. పాత మధురవాడకు చెందిన వ్యక్తి సాక్షి సంతకం పెట్టారన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేసి పదిరోజులు గడుస్తున్నా ఎటువంటి స్పందన లేదన్నారు. క్రయవిక్రయాలకు పాల్పడినవారితోపాటు మధ్యవర్తులను విచారించి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. నిరసనలో సిపిఐ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ సిపిఎం నేత సియ్యాద్రి పైడితల్లి,టిడిపి, వైసిపి నేతలు పాల్గొన్నారు.

నేడు అవంతిలో హెచ్ఆర్‌ల సదస్సు

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ పరిశ్రమల హెచ్ఆర్‌లతో ఈ నెల 9న శనివారం ఉదయం 10 .30 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు అవంతి విద్యా సంస్థల ఛైర్మన్, మాజీ మంత్రి ము త్తం శెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైజాగ్ రీజియన్ ద ఐటి ఎపి లోకేషన్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ కిషోర్ దాసరి, విశాఖ డబ్ల్యుఎన్ఎస్, ఎవిపి టాలెంట్ ఎక్విజిషన్ ప్రతినిధి సిహెచ్ రామ్ నారాయణ, విశాఖ మౌరిటెక్ హెచ్ఆర్ లీడ్ పి నరేష్, పినోమ్ పీపుల్, ఇడి శ్రీనివాస్ పాల్గొంటారన్నారు

శారదాపీఠం భూమి స్వాధీనంపై హర్షం

హెచ్చరిక బోర్డు పరిశీలిస్తున్న విదసం నేతలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : శారదాపీఠానికి గత ప్రభుత్వం కేటాయించిన రూకోట్ల విలువైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం హర్షనీయమని విదసం కన్వీనర్ డాక్టర్ బి వెంకటరావు అన్నారు శుక్రవారం శారదాపీఠం నుంచి ప్రభుత్వ స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు పెట్టిన సంబంధిత భూమిని విదసం సందర్శించారు. విదసం పోరాటానికి ప్రభుత్వం స్పందించి శారదా పీఠానికి కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవడంపై సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనేక చోట్ల ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

'రైల్వే వేగన్' వర్కర్స్ సమస్యలపై వినతి

లేబర్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రాంబాబు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : వడ్లపూడి రైల్వే వేగన్ వర్క్‌షాప్‌లో కార్మికుల సమస్యల పరిష్కరించాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు కోరారు. శుక్రవారం వర్క్‌షాప్‌కు వచ్చిన సెంట్రల్ లేబర్ ఆఫీసర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. రైల్వే వేగన్ వర్క్‌షాప్‌లో కార్మికులకు జిఒలోని నిబంధనల మేరకు ప్రతినెలా 7లోగా వేతనాలను చెల్లించాలని, వర్క్‌షాప్‌లో భద్రతా చర్యలు చేపట్టాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.లేబర్ ఆఫీసర్‌ను కలిసిన వారిలో . రైల్వే వేగన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు, సిఐటియు అధ్యక్షులు డి.రమణ ఉపాధ్యక్షుడు ఎల్ బంగారునాయుడు , రైల్వే వేగన్ వర్క్ షాప్ ప్రెసిడెంట్ కె అవతారం ఉన్నారు.

గీత కార్మికునికి నిత్యావసరాలు

నిత్యావసరాలు అందజేస్తున్న లక్ష్మి తదితరులు

ప్రజాశక్తి- గాజువాక :చెట్టుపైనుంచి పడిన ప్రమాదంతో మంచానికే పరిమితమైన నడుపూరుకు చెందిన కల్లు గీత కార్మికుడు పీట రమణకు యాత,శెట్టిబలిజ, గౌడ, ఈడిగ శ్రీశైలం సంక్షేమ సంఘం వైస్ చైర్మన్ అండిబోయిన అప్పారావు , ప్రధాన కార్యదర్శి వనము నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏపి హైకోర్టు న్యాయవాది, యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు.

ఈ సందర్భంగా అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ కల్లుగీత వృత్తి చాలా ప్రమాదకరమైనదని, వారికి ప్రభుత్వం ఆర్థికతోడ్పాటునివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ పీత సన్యాసిరావు పితాని భాస్కరరావు, చప్పిడి నాగరాజు, వంగల అప్పలరాజు, సుక్క ఈశ్వరరావు, పితాని పాత్రుడు గెద్దాడ అప్పలరాజు. పితాని శంకర్ బత్తిన రాము, బాబూరావు, సంఘ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

సభ్యత్వం నమోదులో పాల్గొన్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ :జివిఎంసి 12వ వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా కొనసాగుతుంది. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాలతో విశాఖ పార్లమెంటరీ కమిటీ పార్టీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీలీలానుసుందర్యయ్యనగర్, పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి టిడిపి సానుభూతి పరులు, కార్యకర్తలు, అభిమానులను కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వం ద్వారా వచ్చే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షులు గాడి సత్యం, బసవ దేవుళ్ళు, నర్సింగ్, రాపర్తి గణపతి, గురజాపు వాసు, గోపి సాయి సంజయ్ పాల్గొన్నారు.

నిధులున్నా జీతాలు చెల్లింపులో నిర్లక్ష్యం

- ఉక్కు ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందులతో క్షోభకు గురిచేస్తున్న యాజమాన్యం
- స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు అయోధ్యరాం

మాట్లాడుతున్న అయోధ్యరాం

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ యాజమాన్యం కావాలని కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె అయోధ్యరాం మండిపడ్డారు. శుక్రవారంఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు ఒండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగైదు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. స్టీల్ ఉత్పత్తి చేస్తూ కనీసం జీతాలు కూడా ఇవ్వకుండా ఎందుకు కార్మికులను క్షోభ పెడుతున్నారని ప్రశ్నించారు. ఉక్కు కార్మికులు జీతాలు లేక అర్థాకలితో అలమటిస్తున్నారని, కానీ స్టీల్ ప్లాంట్ అకౌంట్లో రూ.650 కోట్లు, కరెంట్ అకౌంట్‌లో మరో రూ.300 కోట్లు మొత్తంగా రూ. 950 కోట్లు జమయ్యాయన్నారు. ఇంతగా నిధులున్నా, ఉక్కు కార్మికుల జీతాలకు రూ.24కోట్లను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం కలుగజేసుకుని కార్మికుల జీతాల చెల్లింపుకు చొరవ చూపాలని కోరారు. లేకుంటే ఉక్కు కార్మికులు భార్యాబిడ్డలతో రోడ్డెక్కి నిరసనలు తెలియజేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. గత 40 ఏళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ఈనెల 10న సిఐటియు ఆధ్వర్యంలో పాత గాజువాకలో ధర్నాను విజయ వంతం చేయాలని కోరారు. స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, ఉరిటి మరిడయ్య పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో ప్రణాళికా విభాగం కృషి ఎనలేనిది

విద్యుల్లతకు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు

ప్రజాశక్తి-సీతమ్మధార: ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలతో పట్టణ ప్రణాళిక ఉద్యోగుల కృషి ఎనలేనిదని డిటిసిపి ఆర్‌జె విద్యుల్లత అభిప్రాయపడ్డారు. ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంగళగిరి డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకులు ఆర్‌జె. విద్యుల్లత, అదనపు సంచాలకులు శ్రీనివాసులు, జెవెంసి ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి కె ప్రభాకరరావు, రాష్ట్ర పట్టణ, గ్రామ సంచాలకులను రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, కార్యదర్శి మోహన్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణాళిక దినోత్సవ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా విద్యుల్లత మాట్లాడుతూ, పట్టణ ప్రణాళిక ప్రాముఖ్యతను సంబంధిత విభాగం సిబ్బంది ప్రజలలోకి తీసుకొని వెళ్ళి, ప్రణాళిక బద్ధంగా గృహనిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలని, తద్వారా భావితరాలకు బంగారుబాట వేయాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షులు బేగ్, ట్రెజరర్ కృష్ణ, రాజ్యలక్ష్మి , ఎపిఐ పి నాయుడు, సిఆర్‌డిఎ టిపిఐ శైలజ, సంజీవ్ రత్న కుమార్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

మాట్లాడుతున్న న్యాయమూర్తి సౌజన్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఫస్ట్ మెట్రో పాలిటెన్ మెజిస్ట్రేట్ డి సౌజన్య మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడ వద్దని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చేలా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకుని, సమాజంలో వాటికి లోబడి నడుచుకోవాలన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎం సుధాకర్, పలువురు న్యాయవాదులు, అధ్యాపకులు పాల్గొన్నారు

ఎయు గ్రౌండ్స్‌లో 22 నుంచి సోలార్ ఎక్స్‌పో

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఎండి పృథ్వీతేజ్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈనెల 22 నుంచి మూడురోజులపాటు ఎయు గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న సోలార్ ఎక్స్‌పో పోస్టర్‌నుఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆవిష్కరించారు. పిఎం సూర్యఘర్ కార్యక్రమానికి మద్దతుగా రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రీ నెక్స్' పేరిట 'సోలార్ రెన్యువబుల్ ఎనర్జీ ఎక్స్పో 2024' ను భారీగా నిర్వహించనున్నారు. ఎపిఇపిడిసిఎల్ నెడ్ కేప్ సహకారంతో నిర్వహించనున్న ఎక్స్‌పోలో వివిధ రకాల సోలార్ సంస్థలు, రుణసహాయాన్ని అందించే బ్యాంకులు, స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నాయి.

ఎక్స్‌పో సందర్శనకు ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిఎండి పృథ్వీతేజ్, ఏపి సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.హేమకుమార్, ఉపాధ్యక్షులు పి.నాగరాజు, కార్యదర్శి సిహెచ్. రామమోహనరావు, కోశాధికారి సిహెచ్.జయబాబు పాల్గొన్నారు.

ఎంఎస్ఆర్ఐటిలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు బృందం పాల్గొని,112 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శంభుప్రసాద్ మాట్లాడుతూ, రక్తదానంతో ప్రతిఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిఎంఒ డాక్టర్ సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ పిఒ హరగోపాలు, ఇండియన్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్ సుడిగాలి పర్యటన

డంపింగ్ యార్డు సందర్శనలో జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి సంపత్‌కుమార్ శుక్రవారం 1,2జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానిక అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. నాలుగోవార్డు తిమ్మాపురంలో తాగునీరు, విద్యుద్దీపాలు, శిథిలమైన తుపాన్‌షెల్టర్ కూల్చివేత, స్థానికులకు ఆస్తి పన్ను విధింపు వంటి పలు సమస్యలను స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు కమిషనర్ దృష్టికి తెచ్చారు. వీటిపై కమిషనర్ స్పందిస్తూ, ఇఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్, బోర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ శ్యామ్‌సన్ రాజును ఆదేశించారు. శిథిలమైన తుఫాన్ షెల్టర్ కూల్చివేతకు ఆదేశాలిచ్చారు.జివిఎంసి స్థలాలు దురాక్రమణపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి రామకృష్ణను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎఇ సురేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడున్నారు

కాపులుప్పాడ డంపింగ్ యార్డ్, బయోగ్యాస్ ప్లాంట్ పరిశీలన

మధురవాడ : జివిఎంసి రెండోజోన్ కాపులుప్పాడ డంపింగ్ యార్డ్, సమీపంలోని బయో సిఎన్‌జి ప్లాంట్‌ను జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్ పర్యవేక్షించారు. బయోగ్యాస్ ఉత్పత్తి, తయారీ ప్రక్రియ తదితర అంశాలపై వైజాగ్ బయో ఎనర్జీ ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు కె.ఎస్. రాజాను ఆరా తీశారు.

ప్లాంట్‌లో విడుదలైన ఆర్గానిక్ స్లర్రీ నుంచి పునర్వినియోగ ప్రక్రియను జరపాలని, ప్లాంట్‌కు చేరుతున్న వ్యర్థాలను ప్లాంట్ ప్రవేశ ప్రాంతంలో పడవేయకుండా, ప్రత్యేకంగా పిట్ మాదిరిగా లీచట్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వారం రోజుల్లోగా బయో సిఎన్‌జి ప్లాంట్ మరింత అభివృద్ధికి ప్రణాళికను చేపట్టి నివేదికను సమర్పించాలని నిర్వాహకులను కమిషనర్ ఆదేశించారు. సమీపంలో ఉన్న కంపోస్టు తయారీ పిట్స్‌ను పరిశీలించి, ఇకపై వచ్చిన తడి వ్యర్థాలను సేంద్రియ ఎరువు తయారీకి బయోగ్యాస్ ప్లాంట్ కు తరలించాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్ ను కమిషనర్ ఆదేశించారు.

అనంతరం కాపులుప్పాడలో డంపింగ్ యార్డ్ సందర్శనలో క్లాప్ వాహనాల ద్వారా తరలించిన వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంపై ఎంహెచ్‌ఒను ప్రశ్నించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ ప్లాంట్ కు తరలించేలా వెంటనే ర్యాంపును నిర్మించాలన్నారు. అక్కడున్న రాగ్ పిక్కర్లను గమనించి చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు తప్పనిసరిగా తొడుక్కోవాలని కమిషనర్ సూచించారు. బయో మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలించి, దాని ఫొటోలు, విస్తీర్ణం తదితర వివరాలతో సమగ్ర నివేదిక పంపాలని ఎసిపి రామకృష్ణను ఆదేశించారు. జెడిసి పి.సింహాచలం, ఎఇ సరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిపిఎం అనకాపల్లి మండల మహాసభలో లోకనాథం డిమాండ్

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక భవనంలో సిపిఎం అనకాపల్లి మండల మహాసభ శుక్రవారం బొప్పే ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్య వక్తగా లోకనాథం మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రం అయినప్పటికీ కనీస మౌలిక వసతులు లేవన్నారు. పట్టణంలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అనకాపల్లి - చోడవరం రోడ్డు, అనకాపల్లిలో ఇంటర్నల్ రోడ్లు వెంటనే నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన వారికి వుడా కేటాయించిన ప్లాట్లను అభివృద్ధి చేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో సరైన మౌలిక సదుపాయాలు లేవని, సీరియస్ పేషెంట్లను నేటికీ విశాఖ కెజిహెచ్‌కు తరలిస్తున్నారని, వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుందని పేర్కొన్నారు. అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, వల్లూరులో ప్రభుత్వం సేకరించిన 3వేల ఎకరాల్లో లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేయాలని, లక్ష్మీదేవిపేట వద్ద, సిరసపల్లి -రాజుపేట గ్రామాల మధ్య రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చి కేవలం పెన్షన్, దీపం పథకంలో కొద్దిమందికి లబ్ది చేకూర్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకరరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్య బాబు, కనకల అప్పలరాజు, భీశెట్టి అప్పారావు, జి సుభాషిణి, నూక అప్పారావు, ఎర్రంశెట్టి ఏసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

40 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : అల్లూరి జిల్లా నుండి అక్రమంగా రెండు కార్లలో తరలిస్తున్న 40 కేజీల గంజాయిని దేవరాపల్లి పోలీసులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎస్ఐ బి.మల్లికార్జునరావు శుక్రవారం తెలిపిన వివరాలు ప్రకారం... అల్లూరి జిల్లా నుంచి దేవరాపల్లి మీదుగా రెండు కార్లలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు మండలంలోని శ్రీరాంపురం సమీపంలోని చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వస్తున్న వాహనాలను తనిఖీ చేయగా, ఒక కారులో 2 కేజీలు, మరో కారులో 38 కేజీల గంజాయి పట్టుబడింది. కేరళ రాష్ట్రానికి చెందిన ఫవస్, కురంగాట్, సల్మాన్ ఫారిస్, ముహ్మద్ షిజాస్, శరున్ షాజిని అదుపులోకి తీసుకుని రెండు కార్లు, 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు చేసి చోడవరం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు. కేరళ రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు విఘ్నేష్ అలియాస్ విక్కీ పరారయ్యాడని, ఆయన కొంత కాలంగా అరుకులో నివాసం ఉంటున్నాడని పేర్కొన్నారు.

దీపాంజలి నగర్ క్వార్టర్స్ లోపలకు వెళ్లేందుకు వెసులుబాటు కల్పించాలి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలోని ఎన్టీపీసీ సింహాద్రి పవర్ ప్రాజెక్ట్ యాజమాన్యం ప్రజల అందరినీ హాస్పటల్, బ్యాంకింగ్ సేవలు కోసం దీపాంజలి నగర్ క్వార్టర్స్ లోకి వెళ్ళుటకు అవకాశాలు కల్పించాలని ఉత్తరాంధ్ర బీసీ సంఘం ఉపాధ్యక్షులు కె.కృష్ణం నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్టీపీసీ పవర్ ప్రాజెక్టు కోసం స్థానిక రైతులు భూములు ఇవ్వడం వల్ల ఈ ప్రాజెక్టును ఇక్కడ నిర్మించడం జరిగిందని తెలిపారు. దీపాంజలి నగర్ క్వార్టర్స్‌లో ప్రజలందరికీ ఉపయోగపడే హాస్పిటల్స్, దేవాలయాలు, మెడికల్ స్టోర్స్, బ్యాంకింగ్ సదుపాయాలు, స్కూల్స్, హోటళ్లు, సూపర్ మార్కెట్లు నిర్మించారని, ప్రజలను లోపలకు వెళ్లనీయకపోవడంతో అవన్నీ నేడు బయట ప్రజలకు ఉపయోగపడకుండా పోతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఎన్టిపిసి యాజమాన్యంపై ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నాయకులు ఒత్తిడి తెచ్చి బయట ప్రజలు క్వార్టర్స్ లోపలకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - యలమంచిలి : 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ళ నిండుతున్న వారు సచివాలయంలో ఓటు నమోదు చేసుకోవాలని జనసేన రామనగర్ ప్రతినిధి కోరాడ శ్రీనివాసరావు (మాస్టారు) శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఓటు నమోదుకు ఎస్ఎస్‌సి సర్టిఫికెట్, ఆధార్ జెరాక్స్ కాపీలు శని, ఆదివారాల్లో స్టేషన్‌రోడ్డు తుఫాను బిల్డింగ్‌లో సచివాలయ సిబ్బందిని (బిఎల్ఓ) కలవాలని సూచించారు. ఒక ఊరు నుండి మరో ఊరుకు, ఒక వార్డు నుంచి మరో సొంత వార్డుకు ఓటును మార్చుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సినిమా షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : తపస్వి ఆర్ట్ క్రియేషన్ ప్రొడక్షన్ నెంబర్ బ్యానర్‌లో నిర్మిస్తున్న నూతన సినిమా షూటింగ్‌ను కశింకోట మండలం, నర్సింగబిల్లి శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రారంభించారు. సినిమా ముహూర్తపు షాట్‌కు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ క్లాప్ కొట్టారు. పల్లా అనిల్ కుమార్ దర్శకత్వంలో పల్లా సౌమ్య చాందినిలు నిర్మిస్తున్న ఈ సినిమాలో నూతన నటులు పల్లా నాగు, ఆద్యారెడ్డిలు హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి పీలా గోవింద శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొడుతున్న పీలా గోవింద

గంజాయి కేసులో పదేళ్లు జైలు

ప్రజాశక్తి- చోడవరం : గంజాయి అక్రమ రవాణా కేసుల ముద్దాయి గాడి శ్రీనుకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం తొమ్మిదవ అడిషనల్ సెషన్స్ జడ్జి కె.రత్న కుమార్ తీర్పు వెల్లడించారు. జరిమానా కట్టకుంటే మరో రెండున్నర ఏళ్ళు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి... చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామ వద్ద 2015 జనవరి 17 పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అదే మండలం బయలుపూడి గ్రామానికి చెందిన గాడి శ్రీను 30 కేజీలు గంజాయితో పట్టుబడ్డాడు. అప్పట్లో చీడికాడ ఎస్సై డి విశ్వనాథం కేసు నమోదు చేశారు. కోర్టుకు అన్ని ఆధారాలు సమర్పించడంతో విచారణ అనంతరం న్యాయమూర్తి ముద్దాయికి శిక్షణ ఖరారు చేశారు. ముద్దాయికి శిక్ష పడేటట్లు అన్ని ఆధారాలు చూపిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకట్రావు వాదించారు.

జెడ్‌పి హైస్కూల్లో ఆకతాయిల విధ్వంసం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిలు విధ్వంసం సృష్టిస్తున్నారు. గత కొంతకాలంగా పాఠశాల ఆవరణలోకి రాత్రి సమయంలో ప్రవేశించి పైప్ లైన్ విరగగొట్టడం, ట్యాపులు విరగగొట్టడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం జరుగుతోంది. దీనిపై పలుమార్లు పాఠశాల యాజమాన్య కమిటీ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లింది. ప్రతిరోజు రాత్రి గస్తీ తిరిగే బీట్ పోలీస్, రాత్రి కాపలా కాసే గుర్కాలు పర్యవేక్షిస్తున్నా, నైట్ వాచ్మెన్ పాఠశాల దగ్గర ఉన్న వీరు చేసే అకృత్యాలకు హద్దు లేకుండా పోతుంది. గురువారం రాత్రి పాఠశాల ఆవరణలో ఉన్న సిమెంటు ఇటుకలు తరగతి గదికి అడ్డంగా పేర్చారు. విద్యార్థులు తాగునీటికి ఉపయోగించే పైప్ లైన్ ట్యాప్‌లను పూర్తిగా విరగ్గొట్టారు. స్కూల్ కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

శస్త్ర చికిత్సలకు తరలింపు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలిలో ఏబీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 400 మంది రోగులను తనిఖీలు చేయించుకున్నారు. వారిలో శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి తగరపువలసలోని అనిల్ నీరుకొండ ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో శుక్రవారం తరలించారు. శస్త్ర చికిత్స అనంతరం వారు కోలుకున్న తర్వాత మళ్లీ ఇళ్లకు దింపుతామని ఏబీ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శాంతి స్వరూప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగబిల్లి మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తొట్టా నాగశ్రీనివాస్, నక్కా వెంకటరమణ, ట్రస్టు వలంటీర్లు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సకు బయలుదేరిన రోగులు

సైబర్ నేరాల్లోనే ఎక్కువ నగదు అపహరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : చోరీ కేసుల్లో కన్నా సైబర్ క్రైమ్ ద్వారానే ప్రజలు ఎక్కువగా సొమ్ము నష్టపోతున్నారని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. సాంకేతిక నైపుణ్యంతో అటువంటి నేరాలను పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా పోస్టులు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాల ఛేదనకు అనకాపల్లి గుండాల జంక్షన్ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ తరగతులకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీసు అధికారులు, ఐటి కోర్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ సైబర్ మోసాల కేసులను, సోషల్ మీడియా కేసులు దర్యాప్తుకు సంబంధించి ప్రత్యేకమైన టూల్స్ ద్వారా ఖచ్చితమైన సమాచారం, నేరానికి పాల్పడిన ప్రదేశం గుర్తించవచ్చన్నారు. దర్యాప్తుకు ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చేసుకోవడం ద్వారా అధికారులు సైబర్ నేరాల కేసులను కనిపెట్టవచ్చని చెప్పారు. దర్యాప్తు అధికారులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు గాను సైబర్ నిపుణులు సాయి రామానుజ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సైబర్ నిపుణులు సాయి రామానుజ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వేదికగా జరుగుతున్న వేధింపులు, ఓ.టి.పి. ఫ్రాడ్స్, ఆర్థిక మోసాలు, మొబైల్ లోను యాప్స్ వంటి నేరాల్లో దర్యాప్తు ఏవిధంగా చేయాలి, సాక్ష్యాలను ఏవిధంగా సేకరించాలి, నిందితులను ఏవిధంగా గుర్తించాలన్న విషయాలను పోలీసు అధికారులకు చక్కగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఎస్‌పిలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, కె.వి.సత్యనారాయణ, జీఆర్ఆర్. మోహన్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ టి.కళ్యాణి, ఐటి కోర్ ఎస్సై బి.సురేష్ బాబు పాల్గొన్నారు.

వైసిపి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నేత మలసాల భరత్‌కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తోందని, ఈ నేపథ్యంలో రానున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా ఇచ్చి రైతులను ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎంపిపిలు గొర్లి సూరిబాబు, ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, పెద్దిశెట్టి గోవింద, కశింకోట మండల అధ్యక్షులు మలసాల కిషోర్, నాయకులు బొడ్డేడ శివ, జాజుల రమేష్, కేయం నాయుడు, కోరుకొండ రాఘవ, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కుమార్ రాజా, విల్లూరి శివసూరి, పీడీ గాంధీ, బుద్ద నరసింహరాజు, పీలా బుజ్జి, అయితా రాము, పల్లెల సాయికిరణ్, నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, పంచాడి పద్మ పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీకి తాగునీరు అందించే పైపులైను మండలంలోని పురుషోత్తపురం వద్ద గత శనివారం పగిలిపోవడంతో మున్సిపల్ ఏఇ సుబ్బారావు పర్యవేక్షణలో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. మరమ్మతుల నేపథ్యంలో మున్సిపాలిటీలోని 13 వార్డులకు శుక్రవారం మంచినీటి సరఫరా కాలేదు. సోమిదేవపల్లి వద్ద వరహానది బోరుబావుల నుంచి 315 ఎంఎం జిఆర్‌పీ పైపులైను (ఆర్‌డబ్ల్యుఎస్) ద్వారా యలమంచిలికి నీరు చేరుకుంటుంది. అక్కడ నుంచి వివిధ ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ఆయా ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరు సరఫరా జరుగుతుంది. రిపేరు పనుల మూలంగా యలమంచిలి మున్సిపాలిటీలోని పాతవీధి, తులసీనగర్, కాకివాని వీధి, కుమ్మరి వీధి, భవనారుషి ఏరియా, కోర్టు ఏరియా, నాగేంద్రకాలనీ, కోర్టుపేట, కొత్తపేట, భవనం వీధి, రామనగర్, ఎస్ఆర్ కోలనీ, ఎన్టీఆర్ కోలనీ, మొదలైన ప్రాంతాలకు నీటి సరఫరా జరగలేదని మున్సిపల్ ఏఇ సుబ్బారావు తెలిపారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

'ఉల్లాస్'తో అక్షరాస్యత

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్వయం సహాయక సంఘాలలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వాలంటరీ టీచర్లు కృషి చేయాలని ఎంపీడీవో ఎ.సాంబశివరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో 'ఉల్లాస్' అక్షరాస్యత కార్యక్రమంపై గ్రామ వాలంటరీ టీచర్లకు ఒక రోజు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎంపిక చేసిన అభ్యాసకులకు ప్రతిరోజు రెండు గంటల పాటు గ్రామాల్లో ఉన్న అంగన్వాడి లేదా సామాజిక భవనాల వద్ద తరగతులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యువజన విద్యాశాఖ ఏడి బి చిన్నికృష్ణ మాట్లాడుతూ 15 నుండి 50 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి నిరక్షరాస్యులను చదవడం రాయడం నేర్పించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కే చినబాబు, ఏవో అప్పలరాజు వెలుగు సీసీలు వెంకటరావు, ఉమామహేశ్వరి నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఉల్లాస్ పథకంపై శుక్రవారం బుచ్చియటపేటలో వాలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఓపిఆర్డి విజయలక్ష్మి మాట్లాడుతూ కనీసం 10 మందికి వయోజన విద్య అందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులలో తమ పని తాము చేసుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఏఓ శ్రీనివాసరావు, వెలుగు ఏపిఎమ్ ఓ రాజుబాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఏ.రత్నం, విఓఏలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం బుచ్చయ్యపేటలో శుక్రవారం పంచాయతీ ఈవో లవరాజు, సర్పంచ్ సుంకర లక్ష్మి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద, పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బందితో కలిసి చీపుర్లు పట్టి చెత్త ఊడ్చారు. అనంతరం మొక్కలు నాటారు.

కశింకోట : మండలంలోని పరవాడపాలెం, గొబ్బూరు గ్రామాల్లో చెత్త నుండి సంపద కేంద్రాల వద్ద శుక్రవారం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. తడి చెత్త పొడి చెత్త, వానపాములు పెంపకం గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బలిజి మంగ ముసిలి నాయడు, మళ్ల మణి గోపి, పంచాయతీ కార్యదర్శి దుర్గ, విఆర్‌వో నాయుడు, మళ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

పాము కాటుతో బాలునికి అస్వస్థత

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం జి.సింగవరం గ్రామానికి చెందిన సీరా మోహన్ (14) శుక్రవారం పాము కాటుతో అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం మోహన్ మేక పిల్లలు తీసుకొని సమీపంలో మేపు తుండగా తుప్పలు ఉన్న పాము కాలుపై కాటు వేసింది. దీంతో అస్వస్థతకు గురి కావడంతో తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

అయ్యప్ప పూజలో వైసిపి నేత భరత్

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జోగారావుపేట గ్రామంలో అయ్యప్ప స్వామి అంబలం పూజ కార్యక్రమంలో గురువారం రాత్రి వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్, మలసాల కిషోర్, మలసాల కుమార్ రాజా పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి వారి మధుర గీతాన్ని ఆలపించారు.

వెంకటరావుకు నాగజగదీష్ నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ క్రియాశీల సీనియర్ కార్యకర్త కాలెపు వెంకట్రావు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు వెంకట్రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్రావు ఎన్టీఆర్ అభిమాని అని, టిడిపి స్థాపించిన దగ్గర నుండి క్రియాశీలక కార్యకర్తగా పార్టీకి సేవలందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఇల్లపు నూకేశ్వరరావు, వేగి వెంకటరమణ, పిట్ల హరీష్, అఖిల్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నాగజగదీష్

విఓఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం క్లస్టర్ పరిధిలోని నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట మండలాల విఓఎలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న ఇంటికి వెళ్లి, ఆయన సతీమణి పద్మావతికి వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు, ఇతర సమస్యలపై తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో త్రినాథ్, బుజ్జి, లలిత, పద్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక వెలుగు కార్యాలయం వద్ద వివోఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, అక్రమ, రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని, మహిళ మార్టులలో సరుకులు కొనుగోలుకై బలవంతపు టార్గెట్లు ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వివోఏల మండల కార్యదర్శి గట్రెడ్డి రాము, కోశాధికారి కే సృజన, పి.వరలక్ష్మి, టి.మణి, మండలంలోని వివోఏలు పాల్గొన్నారు.

పద్మనాభం : స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మూడోరోజు నిరసనలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడారు. విఓఎల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, వేతన బకాయి చెల్లించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ఇతర సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో పి కంచమ్మ, ఆర్ రామలక్ష్మి, లీల, మహాలక్ష్మి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక వెలుగు కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని విఓఎల ఆందోళన కొనసాగింది. సిఐటియు అనుబంధ సంఘం గౌరవాధ్యక్షులు పి మణి, సిఐటియు నేతలు భాగం లక్ష్మి, విఓఎల సంఘం నాయకులు పార్వతి, వెంకటలక్ష్మి, ఎస్ గున్న పాల్గొన్నారు

భీమిలిలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మణి

గ్రామ కంఠం స్థలాన్ని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి రెవెన్యూ సర్వే 259/2లో పినకోట వెళ్లే రోడ్డులో ఉన్న సుమారు కోటి రూపాయలు విలువ చేసే గ్రామ కంఠం స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండల తహశీల్దార్‌కు, పంచాయతీ ఇఒకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినకోట రోడ్డుకు ఆనుకొని పాత డంపింగ్ యార్డు వద్ద ఉన్న ఈ గ్రామ కంఠం స్థలాన్ని దేవరాపల్లి గ్రామానికి చెందిన గొర్లె దేముడమ్మ అనే వ్యక్తి దేవరాపల్లి గ్రామానికి చెందిన చిట్టూరి గంగరాజుకు, బేతపూడి గ్రామానికి చెందిన గుంప్పేన రేవతికు, కాశీపురం గ్రామానికి చెందిన గండి గోవిందరావుకు విక్రయించినట్లు తెలిపారు. దీనికి లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని అప్పటి విఆర్వో నూకరాజు అమ్మకానికి అవసరమైన ధ్రువపత్రాలు మంజూరు చేశారని, ఈ ధ్రువపత్రంతో కె.కోటపాడు రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. దీనిపై ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి తహశీల్దార్‌కు పిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసి, హెచ్చరిక బోర్డులు పెడతామని హామీ ఇచ్చారని తెలిపారు. కాని నేటికీ బోర్డులు పెట్టలేదన్నారు. దేవరాపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ కంఠం భూములు అమ్మకానికి అవసరమైన ధ్రువపత్రాలు ముడుపులు తీసుకొని రెవెన్యూ అధికారులు విచ్చలవిడిగా ఇవ్వడం వలన ఈ విధంగా విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కొబ్బరితోట, పాత డంపింగ్ యార్డు స్థలాలను అన్యాక్రాంతం చేసి అమ్మకాలు చేస్తుండగా, సిపిఎం అడ్డుకోవడంతో డంపింగ్ యార్డు స్థలంలో సచివాలయం, కొబ్బరితోట స్థలంలో హెల్త్ సబ్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, అంగన్వాడీ కేంద్రం నిర్మాణం చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామకంఠం అమ్మకానికి అవరమైన ధ్రువపత్రాలు మంజూరు చేసిన విఆర్ఒపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డులు పెట్టి ఆ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యాన ఎర్ర జెండాలు పాతి ఆ భూమికి రక్షణ కల్పిస్తామని హెచ్చరించారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత వెంకన్న

11న ఆర్‌డిఒ ఆఫీసు ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక : భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11న జరిగే ఆర్డీవో కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో శుక్రవారం చలో ఆర్డీఓకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఇసుక పాలసీని మారుస్తామని, అందరికీ ఇసుక ఉచితంగా ఇస్తామని, సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను విస్మరించారని తెలిపారు. తక్షణమే హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మద్దాల రాము, సుబ్రహ్మణ్యం, కాండ్రేగుల రామ అప్పారావు, మొల్లేటి వాసు, సూరి శెట్టు సైదు నాయుడు, మద్దాల సీతారాం, భానుజీ, ఆడారి సురేష్, చిన్న అప్పారావు పాల్గొన్నారు.

15న షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆరిపాకలో చెరుకు కాట వద్ద ఉన్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయం14వ వార్షికోత్సవం ఈ నెల 15న నిర్వహించునట్లు ఆలయ ధర్మకర్త మళ్ళ కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయిబాబా ఆలయం వద్ద వార్షికోత్సవ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవ రోజున మహిళల కోలాట పోటీలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, అదే రోజు సాయంత్రం దీపోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అరసాడ సూర్యనారాయణ, బుద్ధ నరసింహమూర్తి, బండారు వెంకటరమణ, పొలమరశెట్టి అప్పారావు, కోరుమిల్లి నాగేశ్వరరావు, శరగడం అయ్యలనాయుడు, రాపేటి సూరప్పారావు, శరగడం జగన్, బండారు అప్పారావు, లాలం తాతబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు సంస్కృతి విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : గత నెల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా బేస్ పోటీలలో ప్రతిభ కనబర్చిన మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు కె.కుశ్వంత్, సత్యఆనంద్, నవనీత్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు గుంటూరు జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. ఎంపిక అయిన విద్యార్థులతో పాటు కోచ్ రాజేష్‌ను స్కూల్ సీఈఓ కె. నిశాంత్ అభినందించారు.

మద్యం మత్తులో సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన వ్యక్తికి ఒకరోజు జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మద్యం మత్తులో హత్య కేసులో సాక్ష్యం చెప్పడానికి అనకాపల్లి 10వ అడిషనల్ సెషన్స్ జడ్జ్ కోర్టుకు వచ్చిన వ్యక్తికి 11వ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం ఒకరోజు జైలు శిక్ష, 50 రూపాయల జరిమానా విధించింది. సబ్బవరం హత్య కేసులో సాక్ష్యం చెప్పేందుకు అనకాపల్లి పదవ అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టుకు హాజరైన సబ్బవరం మండలం ఆదిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన గొర్లి సత్తిబాబుపై పట్టణ సిఐ విజయ్ కుమార్ పెట్టి కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరుపరచగా సత్తిబాబు పై ఈ విధంగా శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. దీంతో ముద్దాయిని సబ్ జైలుకు తరలించారు.

2 వేల కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తారువ పరిసర ప్రాంతాల్లో రెండు ఆటోల్లో తరలిస్తున్న 2వేల కిలోల రేషన్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఉదయం మాటు వేసి ఈ బియ్యాన్ని పట్టుకొని, ఆటోలను, బియ్యాని సీజ్ చేశారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిపై 6ఏ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు స్థానిక విలేకరులకు తెలిపారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం వేగి వీధి, చిన్న హైస్కూల్ ప్రాంతాలలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మారిశెట్టి శంకరరావు, వేగి కృష్ణ, బెల్లాన శ్రీనివాసరావు, యండకుర్తి అప్పలరాజు, జెర్రిపోతుల నూకరాజు, భానుచందర్ అఖి, గణేష్, మళ్ళ గణేష్ పాల్గొన్నారు.

వినియోగంలోకి సులభ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకష్ణ, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ చొరవతో తుమ్మపాల గ్రామం సచివాలయం-2 నూతన భవనం పక్కన ఉన్న పురుషుల సులభ్ కాంప్లెక్స్‌ను ఎట్టకేలకు శుభ్రపరచి వాడుకలోకి తెచ్చారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో సులభ్ కాంప్లెక్స్ చుట్టూ ఉన్న తుప్పలను డొంకలను తొలగించారు. తెగిపోయిన కరెంటు వైర్లను మరమ్మతులు చేసి, మోటార్‌ను బాగు చేసి రన్నింగ్ వాటర్ పునరుద్ధరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, జనసేన నాయకులు పీలా తాతునాయుడు, జిల్లా టెలికాం మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, చదరం చిన్న, గాలి జగదీష్, కొణతాల నాయుడు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ పరిసరాలను శుభ్రం చేసిన దృశ్యం

మండల సర్వసభ్య సమావేశంలో..

సమస్యలపై ప్రజాప్రతినిధుల గళం

ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపిపి రత్నం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వైస్ ఎంపిపి నానాజీ, ఎంపిటిసి సభ్యులు గోవిందరావు, మధు మాట్లాడుతూ నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు ప్రథమ చికిత్స అందించి రిఫరల్ చేస్తున్నారని, దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. నక్కపల్లి ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ శిరీషకు సూచించారు. రోగులపట్ల స్టాఫ్ పనితీరు సక్రమంగా లేదని, ఆసుపత్రి పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. మినీ గోకులం షెడ్డులను గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం లేకుండా ఎందుకు మంజూరు చేసారని ఉపాధి హామీ పథకం ఏపీఒ, పశు వైద్య అధికారులను నిలదీసారు. పశు వైద్య శాఖ అధికారులు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్దండపురంలో ముంపునకు గురైన వరి పొలాలకు సంబంధించి చాలా మంది అర్హులైన రైతులకు పరిహారం అందలేదని, పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని సర్పంచ్ వెంకటేశ్వరరావు ఎంపిటిసి సభ్యులు రాజు కోరారు. ఉపమాక జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను సర్పంచ్ ప్రగడ వీరబాబు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పెదతీనార్ల ఎంపిటిసి సభ్యులు మెరుగు నాగేశ్వరరావు మాట్లాడుతూ, చినపెదతీనార్ల ఎంపిటిసి సభ్యులు మెరుగు నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామంలో 113/9 సర్వే నెంబర్లలో ఎటువంటి అనుమతులు లేకుండా లే-ఔట్ వేసి కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని ,తక్షణమే విచారణ చేపట్టాలని తెలిపారు. చినతీనార్లలో సచివాలయంలో స్టాఫ్ బదిలీపై వెళ్లారని, దీంతో ప్రజలకు సేవలు అందడం లేదని భర్తీ చేయాలని సర్పంచ్ ముసలయ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలువురు పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సభ్యులు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఈశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మాధవరావు

కృత్రిమ మేధస్సుపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: కృత్రిమ మేధస్సు పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు సూచించారు. పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో శుక్ర,శనివారం రెండు రోజులు పాటు కృత్రిమ మేధస్సు పై వర్క్ షాపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా డాక్టర్ చుండూరు మాధవరావు, అసోసియేట్ ప్రొఫెసర్ వై.శివ ప్రసాద్ లు విచ్చేసి కృత్రిమ మేధస్సు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఏఐ ఆధారిత పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, మెరుగైన విశ్లేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతుకు నిధుల మంజూరు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పలు గ్రామాలకు గుంతల రహిత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు రహదారులు భవనాలు శాఖ జూనియర్ ఇంజనీర్ నారాయణరెడ్డి తెలిపారు. బైపిరెడ్డి పాలెం, పాములవాక, రామన్నపాలెం గ్రామాలకు 9లక్షలు మంజూరు కాగా, లింగాపురం నుండి వెంకటాపురం వరకు 8 లక్షలు, పాత రోడ్డు నుండి రాచపల్లి వెళ్లే వరకు మూడు లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కైలాస పట్నం నుండి రాజుపేట రోడ్డుకు 1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో హెల్త్ సూపర్‌వైజర్(గెస్ట్ ఫాకల్టీ)గా పని చేయుటకు అర్హులైన ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం అర్హత కలిగి ఉండాలన్నారు. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్, ఒక సెట్ నకలు ధృవపత్రాలతో ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తాళ్లపాలెం అంబేద్కర్ గురుకుల పాఠశాలకు హాజరు కావాలన్నారు.

పంటలను పరిశీలిస్తున్న అధికారులు

తొలి దశలోనే తెగుళ్లను నివారించాలి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగందొర పాలెం, అమ్మపేట, కొత్తమల్లం పేట, పాకలపాడు గ్రామాల్లో టమాటా పంటలను ఉద్యాన అధికారులు ఎస్.శిరీష, రైతు సేవ కేంద్రం సిబ్బంది విహెచ్ఎ శివగంగాధర్, ఆత్మ బీటీఎం కిషోర్ పరిశీలించారు. టమోటా పంట క్షేత్రాలను సందర్శించగా విరివిగా విస్తరించినటువంటి టమాటా బ్యాక్టీరియల్ విల్ట్‌ని గుర్తించారు. తొలి దశలోనే నివారణ చర్యలు తీసుకోవడంతో బ్యాక్టీరియల్ విల్ట్ బారిన పడకుండా నివారించవచ్చునని తెలిపారు. మెరుగైన నీటిపారుదల పద్ధతులను డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని పాటించడంతో నీటి ద్వారా ఒక మొక్క నుండి మరొక మొక్కకు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సంక్రమించకుండా అరికట్టవచ్చని సూచించారు. కొత్తగా పంట వేసుకునే రైతులు ముందుగా రైతు సేవ కేంద్రంలోని విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ లేదా అగ్రికల్చర్ అసిస్టెంట్ లేదా సంబంధిత ఉద్యాన అధికారిని సంప్రదించి సలహాలు సూచనలు తీసుకున్న తర్వాత పంట వేసుకోవాలన్నారు.

విజయ సాయిరెడ్డిని సత్కరిస్తున్న నేతలు

విజయ సాయిరెడ్డిని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి: ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని శుక్రవారం విశాఖలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, పార్టీ అంతర్గత విషయాలను చర్చించారు. ఆయన ను కలిసిన వారిలో ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, నాయకులు తళ్ల భార్గవ్, గోవింద్ ఉన్నారు.

పనులు చేయిస్తున్న కార్యదర్శి

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని కవగుంట సంపద తయారీ కేంద్రం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను సర్పంచ్ దాసరి సూర్యకుమారి, పంచాయితీ కార్యదర్శి రాజబాబు ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అసంపూర్తిగా నిలిచిన షెడ్డుకు అంచనా వేసి మండల పరిషత్తు తదితర నిధులు కేటాయిస్తే ఈ సంపద తయారీ కేంద్రాన్ని పూర్తిచేసి వాడుకలోకి తీసుకురావడానికి వీలవుతుందన్నారు.ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

మాట్లాడుతున్న సర్పంచ్

ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగంపేట పంచాయతీలో సర్పంచ్ జువ్వల లక్ష్మీ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ఈసీ రాధిక మాట్లాడుతూ రైతులు అవసరమైన పనులు చేపట్టడం కోసం ఈ గ్రామ సభ నిర్వహించడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన పనులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న ఉచిత ఇసుక

మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు

ప్రజాశక్తి- కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పక్క దారి పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు విమర్శించారు. విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక నిర్ణయం మంచిదేనైనా సాధారణ ప్రజలు కనీసం అవసరాలకు వాడుకోవడానికి ఉపయోగపడుతుందని తామంత భావించామన్నారు. ఉచిత ఇసుక పేరుతో అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నా అధికారులు ఎవరూ చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం పట్ల పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయని తెలిపారు. వరాహనది సమీపంలోనే భారీ ఎత్తున అక్రమ నిల్వలు పోగు చేసి రాత్రి సమయంలో లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని విమరిశంచారు. అధికారుల వైఖరి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తుందన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు, అధికారులు స్పందించాలని కోరారు. తమ వద్ద ఉన్న వీడియోలను విలేకరులకు సాక్షాలుగా చూపిస్తూ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ: సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ డిసెంబరు 20, 21, 22 తేదీల్లో నర్సీపట్నంలో మూడురోజుల పాటు ఈ మహాసభలు జరగనున్నాయన్నారు. 21న బహిరంగ ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ సభలకు సిపిఎం జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారన్నారు. ఈ మహాసభలకు కార్మిక, రైతు, ఉద్యోగులు, మేధావులు, విద్యార్థి, యువజనులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తూబిరి రాజుబాబు, బాలరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రీ సర్వే గ్రామ సభలు

రోలుగుంటలో వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-రోలుగుంట: కోర్టులో ఉన్న భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఎలా ఇస్తారని వీఆర్వో లక్ష్మణ్‌పై మండల తహశీల్దార్ నాగమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో రీ సర్వే రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. రైతులు రీ సర్వేలో ఉన్న తప్పులు తడకలు జరిగాయని, దీనిపై న్యాయం చేయాలని అర్జీలు పెట్టుకున్నారు. దీనిలో భాగంగా కంచుగుమ్మల గ్రామానికి చెందిన మనుమంతు వరహాలు, మిరియాలు అప్పలరాజు వారి భూముల వాటాలపై సమస్యలు పరిష్కారం కోసం కోర్టుకు వెళ్లారు. ఈ క్రమంలో పాస్ పుస్తకం ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ శ్రీనివాసరావు, సర్వేయర్ తాటి నాయుడు, కార్యదర్శి నూకరాజు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని ఈ.మర్రిపాలెం రెవిన్యూ గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ ఎస్‌వి అంబేద్కర్ ఆధ్వర్యాన నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కె.గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన చిప్పాడ రామారావు వినతిపత్రం అందజేశారు.

బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠపురం, రాజాం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో గ్రామస్తులు రీ సర్వే సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎం.లక్ష్మి, సర్పంచ్‌లు పడాల భూషణం, మరిసా నాని, కోట సత్యనారాయణ, మరిసా సతీష్, నరేష్ పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని వెంకటాపురం గ్రామంలో రీసర్వే, ఇతర భూసమస్యలపై తహశీల్దార్ కె. ఆనందరావు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వేలో చోటుచేసుకున్న తప్పిదాల సవరణకు గ్రామానికి చెందిన పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి రమణ, మాజీ ఎంపిటిసి ఎ.గంగరాజు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన విఆర్‌ఒ

ప్రజాశక్తి-కోటవురట్ల: మాకవరపాలెం మండలం తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా భీమబోయినపాలెం గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి రూ.15వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పీలు రమ్య, నాగేశ్వరరావులకు పట్టుబడ్డారు. భీమ బోయిన పాలెం గ్రామంలో తన తండ్రి నుంచి సంక్రమించిన 7.15 ఎకరాల భూమిని తమ కుటుంబ సభ్యులకు మ్యూటేషన్ నిమిత్తం దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారి లంచం అడగడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం దాడులు నిర్వహించిన దాడుల్లో వీఆర్వో పట్టుబడినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

విఆర్‌ఒ, ఆయన బావ మరిది

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ఇకెవైసి పేరుతో దోపిడీ తగదు : సిపిఎం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ పంపిణీ నేపథ్యంలో స్థానిక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఇకెవైసీ పేరుతో డబ్బులు వసూలు చేసి దోపిడీకి పాల్పడుతుందని సిపిఎం నేతలు విమర్శించారు. శుక్రవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో గ్యాస్ ఏజెన్సీ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ,ఇకేవైసీ పేరుతో పేద ప్రజల వద్ద డబ్బును వసూలు చేస్తున్నారన్నారు.లబ్ధిదారులు ఏజెన్సీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం ఉచిత గ్యాస్ దీపం పథకానికి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఈకేవైసీ చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రకటించినప్పటికీ ఈ ఏజెన్సీ అందుకు విరుద్ధంగా దోపిడీకి పాల్పడుతుందన్నారు. ప్రభుత్వ అదేశాలను ఉల్లంగిస్తూ కార్యాలయం వద్ద లబ్ధిదారుల దగ్గర వసూలకు పాల్పడుతుందని విమర్శించారు. సిపిఎం నేత ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: క్యాన్సర్ వ్యాధిపై అందరికీ అవగాహన ఉండాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద సూచించారు.ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం కెజిహెచ్ లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద,ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ,స్క్రీనింగ్ లో క్యాన్సర్ లక్షణాల గల రోగులకు తదుపరి నిర్ధారణ పరీక్షలు జరిపించుటకు కింగ్ జార్జి ఆసుపత్రి నందు ప్రివెంటివ్ అంకాలజి ఓ.పి. విభాగాన్ని కెజిహెచ్ సియస్ఆర్ బ్లాకు ఓ.పి.నంబరు 40లో ప్రతీ మంగళ, గురువారాల్లో ఓ.పి.ని నిర్వహించటం జరుగుతుందఅన్నారు. ఈ ఓపి విభాగాన్ని ఈ నెల 12 న ప్రారంభించుచున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కెజిహెచ్ ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ ఆఫీసర్ కె.సాయి సుష్మా, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి కె.శిల్ప, విభాగాదిపతులు పాండురంగ కుమారి, గురు రాఘవేంద్ర నాయక్, కెజిహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్- 1 పద్మావతి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు కొండ వెనుకపాలెం గ్రామంలో శుక్రవారం శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయ ప్రకాష్, నాయకులు మనబాల తాతారావు పాల్గొన్నారు.

సమస్యలపై సిపిఎం ప్రజాపోరు

- ధరాభారంపై ఇంటింటా ప్రచారం -పలుచోట్ల కరపత్రాల పంపిణీ, వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

అక్కయ్యపాలెంలో ప్రచారం చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగసంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్ మండిపడ్డారు. అధిక ధరలను నియంత్రించి, నిత్యావసర ధరలను అందుబాటులోకి తేవాలని, విద్యుత్ ట్రూ ఆప్ ఛార్జీల రద్దు, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయం ఉపసంహరణ, విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆరిలోవ బిఎన్ఆర్ నగర్ కాలనీలో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా ప్రజలపై విపరీతమైన నిత్యావసర ధరభారం మోపుతోందన్నారు. ట్రూఅప్ పేరిట రూ.18 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలన్నారు. దీనిపై ఈనెల 14 వరకు ఇంటింటా ప్రచారం నిర్వహించి, 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.నరేంద్ర కుమార్, డి.నాగరాజు, ఎ.రమణ, సన్యాసమ్మ, లక్ష్మీ, నరేష్, భాషా, స్థానికులు పాల్గొన్నారు.

బిఎన్ఆర్ నగర్‌లో నేతల ప్రచారం

సీతమ్మధార: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం ప్రజాపోరులో ప్రజలంతా భాగస్వాములు కావాలని సిపిఎం విశాఖ జిల్లా నాయకులు యుఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు.శుక్రవారం 45వ వార్డు అక్కయ్యపాలెంలో సిపిఎం జోన్ నాయకులు అప్పలరాజు, లలిత, లీల, సోబా, ప్రసాద్‌లతో కలిసి ఇంటింటా ప్రజాపోరు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర బిజెపి, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వాలు ధరల నియంత్రణ చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలు మానుకోవాలన్నారు .విద్యుత్ చార్జీలను తగ్గించడంతోపాటు ఉచిత ఇసుక అమలు, ఖాళీపోస్టులు భర్తీ, కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్, లేబర్‌కోడ్స్ రద్దుచేయాలని కోరారు. దీనిపై ఇంటింటా కరపత్రాలు పంపిణీ, పాదయాత్రలు, గ్రూపు మీటింగులు, సచివాలయాల వద్ద నిరసనలతో ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమంలో భాగస్వాములను చేస్తామన్నారు.డివైఎఫ్ఐ ప్రతినిధి రాజు గౌరీస్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

మధురవాడ : ప్రజా సమస్యలపై సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 8నుంచి నిర్వహించనున్న ప్రజాపోరుయాత్రలో భాగంగా శుక్రవారం కొమ్మాది సిఐటియు కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సిపిఎం నేత డి.అప్పలరాజు, పి రాజ్ కుమార్, బి భారతి, డి కొండమ్మ, టికె.శారద పాల్గొన్నారు.

తగరపువలస : సిఐటియు కార్యాలయం సమీపంలో సిపిఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా పోరు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోన్ కమిటీ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, ఓళ్ళ నాగరాజు, ఆర్ నరసింగరావు పాల్గొన్నారు

గాజువాక. : సిపిఎం ప్రజాపోరు వాల్‌పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. సిపిఎం గాజువాక జోన్ కమిటీ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు డి రమణ, బంగారు నాయుడు, సంతోషం పాల్గొన్నారు.

భీమిలిలో..

కశింకోటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ సిపిఎం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బైరెడ్డి గురప్ప, డి వెంకట్రావు, పాల అప్పలరెడ్డి, బి భానోజీ, బి సింహాచలం, సురేష్, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు .

అచ్యుతాపురం ప్రజా సమస్యలు పరిష్కారానికే సిపిఎం ప్రజాపోరు కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, ఆర్.రాము అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో శుక్రవారం ప్రజా పోరు పేరుతో ఇంటింటి ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు, రాము మాట్లాడుతూ ప్రస్తుతం అధిక ధరలు, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఎస్ఈజెడ్ పరిశ్రమలలో 75 శాతం ఉపాధి స్థానికులకే కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె సోమునాయుడు, ఎస్ రామునాయుడు, ఎన్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట : సిపిఎం చేపట్టిన ప్రజాపోరు వాల్ పోస్టర్‌ను కసింకోటలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 8 నుండి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డిడి.వరలక్ష్మి, ఆర్.అమ్మాజీ, బి.చెల్లయమ్మ, ఎం.సత్యవతి, కుమారి, రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ ప్రారంభం

ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి జి అప్పారావు నాయుడు అన్నారు. నక్కపల్లి లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68 వ అండర్-14 బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ శుక్రవారం స్థానిక హాకీ క్రీడా ప్రాంగణం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలోనూ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు ఈ టోర్నమెంట్ జరగనుంది. జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు,ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జయరత్న కుమారి, జడ్పిటిసి సభ్యురాలు కాసు లమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, బిజెపి మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పతాకం ఆవిష్కరించి, టోర్నమెంటును ప్రారంభించారు.

ఈ సందర్భంగా డీఈవో అప్పారావు నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యత పెంపొందించుకుని హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలకు పేదరికం అడ్డుకాదన్నారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలని, ఓర్పు, సహనం, పట్టుదల అలవర్చుకోవాలన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు మాట్లాడుతూ, నక్కపల్లిలో రెండవసారి హాకీ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మొదటి రోజు ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, ఎంఈఓ లు కె.నరేష్, వేమగిరి నూకరాజు, బిఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, కార్యదర్శి తాతాజీ, కోచ్ లు పాల్గొన్నారు.

హోరాహోరీగా తలపడిన జట్లు

తొలిరోజు బాలుర విభాగం లో ఐదు జట్లు తలపడ్డాయి. ఈస్ట్ గోదావరి కర్నూల్‌పై 4-0 తో విజయం సాధించింది. ప్రకాశం -విజయనగరం మ్యాచ్ టైగా ముగిసింది. గుంటూరు శ్రీకాకుళంపై 1-0 తేడాతోనూ, కృష్ణపై నెల్లూరు 1-0తేడాతోనూ, వెస్ట్ గోదావరిపై 1-2తేడాతో అనంతపురం విజయం సాధించాయి.

బాలికల విభాగం లో

నెల్లూరుపై కృష్ణ జట్టు 0-2తేడాతో విజయం సాధించింది. ఈస్ట్ గోదావరి శ్రీకాకుళంపై 1-0 తేడాతో విజయం సాధించింది. విజయ నగరం-కర్నూల్ మ్యాచ్ టైగా ముగిసింది.చిత్తూరు -ప్రకాశం, వెస్ట్ గోదావరి -గుంటూరు మ్యాచ్‌లు టైగా. ముగిశాయి.

వెంకటస్వామికి పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఒంగోలు కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) 18 వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ సభా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళా మిత్రమండలి జాతీయ అధ్యక్షులు నూనె అంకమ్మరావు,కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, అవార్డ్ కమిటీ ఛైర్మన్ తేళ్ళ అరుణ ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ జాతీయ స్థాయి ప్రతిభా పురస్కార ప్రధానోత్సవంలో ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు ఆచార్యులు బూసి వెంకటస్వామికి తన్నీరు కోటయ్య స్మారక జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు వారు తెలియజేసారు. బూసి వెంకటస్వామికి అవార్డు ప్రకటించడం పట్ల విశ్వవిద్యాలయ ఉపకులపతి, రిజిస్ట్రార్ ,రెక్టార్, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు అభినందనలు తెలియజేసారు.

ఇసుక నిల్వలు పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో జిరాయితి భూముల్లో నిల్వలున్న ఇసుక వనరులను శుక్రవారం తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో భూగర్భ గనుల శాఖ,రెవెన్యూ ఇరిగేషన్ శాఖ, గ్రౌండ్ వాటర్ అధికారులు పరిశీలించారు. గొటువాడ గ్రామంలో సర్వే నెంబర్ 30-1,32-2, చౌడువాడ గ్రామంలో సర్వే నెంబర్ 220 లోగల ఇసుక నిల్వలను పరిశీలించారు. విస్తీర్ణంలో సర్వే చేసి ఎంత మేర ఇసుక నిల్వలు ఉన్నాయన్న విషయం ప్రకటిస్తామని భూగర్భ శాఖ అధికారి సత్యమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఊర్ధ్వరావు పాల్గొన్నారు.